నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల

వనపర్తి

3 | మహబూబ్‌నగర్, బుధవారం 8 మే 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


# నేడు కేటీఆర్ రాక

- కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాలలో రోడ్‌షో



విలేకరులతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు



## పర్యటనను విజయవంతం చేద్దాం

- కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని ప్రజలు గ్రహించారు..
- బహిరంగ సభల్లో సర్కారు అసత్య ప్రచారాలు
- ఆర్ఎస్పీని అధిక మెజార్టీతో పార్లమెంట్‌కు పంపుదాం
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, మే 7 : అచ్చంపేటలో బుధవారం నిర్వహించే రోడ్ షోకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని.. ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో సమావేశమై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయామని ప్రజలకు తెలిసొచ్చిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా తాము నిర్వహిస్తున్న రోడ్ షోలకు ప్రజలు భారీగా హాజరవడాన్ని జీర్ణించుకోలేని ఇతర పార్టీలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉండి కేసీఆర్‌ను లేకుండా చేస్తామనడం.. బీఆర్ఎస్‌ను అంతమొందిస్తాననడం విడ్డూరంగా ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేసే ఆలోచనలు మాని.. ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి, వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేశామని బహిరంగ సభల్లో జబ్బలు చరుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీస్ శాఖలో అత్యున్నత స్థానాన్ని వదులుకొని ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నాడన్నారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకొని పార్లమెంట్‌కు పంపే బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే రోడ్‌షోకు ప్రజలు భారీగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, అమీనొద్దీన్, రవీందర్‌రావు, కౌన్సిలర్లు రమేశ్‌రావు, కుతుబుద్దీన్ తదితరులున్నారు.

### హెలీప్యాడ్ స్థల పరిశీలన

అచ్చంపేట, మే 7 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం అచ్చంపేటకు వస్తుండడంతో ఎన్టీఆర్ స్టేడియంలో హెలీప్యాడ్ స్థలాన్ని గువ్వల బాలరాజు పరిశీలించారు. మధ్యాహ్నం మూడు గంటలకు మసీదు నుంచి రోడ్ షో ప్రారంభమవుతుందని, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు అమీనుద్దీన్, కౌన్సిలర్లు రమేశ్‌రావు, కుతుబుద్దీన్, శంకర్ మాదిగ, రవి తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో 4 గంటలకు..

గద్వాల, మే 7 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాలలో రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు రోడ్ షో అనంతరం పాతబస్టాండ్‌లో కేటీఆర్ ప్రసంగిస్తారని చెప్పారు. ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## రోడ్ షోకు ఏర్పాట్లు పూర్తి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, మే 7 : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం కల్వకుర్తిలో నిర్వహించనున్న రోడ్ షోకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్యాహ్నం 2:30కు కల్వకుర్తికి వచ్చి కేసీఆర్ కన్వెన్షన్ హాల్‌లో 3 గంటలకు నిర్వహించే సభలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఐదువేలకు పైగా కార్యకర్తలు, బీఆర్ఎస్ అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. మత ప్రాతిపదికన రాజకీయాలు చేస్తున్న బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే మురుగుకాల్వలో వేసినట్టేనన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి


- కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు
- హామీలు అమలు చేయలేక 'కారు'పై బురదజల్లే ప్రయత్నం
- వార్డు సమావేశాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 7 : మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి.. వాటిని అమలు చేయలేక బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా గద్వాల మున్సిపాలిటీలోని 16, 17, 18, 20, 21, 31వ వార్డుల్లో ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆగమై నానా అవస్థలు పడుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో నూతన బస్టాండ్‌తోపాటు సమీకృత కూరగాయల మార్కెట్, ఇండోర్ ఆడిటోరియం, సెంట్రల్ లైటింగ్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంతో పాటు దేశం కూడా అధోగతి పాలవుతుందని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రేవంత్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. సీఎం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తిరగడానికి, ఇతర పార్టీల నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికే సమయం సరిపోతుందని.. ప్రజల బాగోగులు ఎలా పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. గురుకులాల కార్యదర్శిగా ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు బాబర్, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, మురళి, దౌలు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, రామకృష్ణశెట్టి, గోవిందు, సాయిశ్యాంరెడ్డి, వంశీ, ధర్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను గద్దె దించుదాం

- హామీల అమలులో పూర్తిగా విఫలం : మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, మే 7 : అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని చంద్రకల్, మరికల్ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ఆయన మంగళవారం సమావేశమై మాట్లాడారు. కేసీఆర్ పదేండ్లలో అమలు చేసిన పథకాలను వారికి వివరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని.. హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి.. విద్యావేత్త, మాజీ ఐపీఎస్ ఉద్యోగి అయిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందామని కూలీలకు సూచించారు. కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు వినొద్దన్నారు. పెద్దకొత్తపల్లి మండలం నుంచి ఆర్ఎస్పీకి అత్యధిక మెజార్టీని అందించి బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపించాలన్నారు. కార్యక్రమంలో శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గణేశ్‌రావు, నాయకులు రవి, స్వామి, వెంకటయ్య, నాగరాజు పాల్గొన్నారు.



మరికల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- అన్నదాతను విస్మరించిన సర్కారు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 7 : మహబూబ్‌నగర్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులోని ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు అధికారులు ముందుకు రావడం లేదని రైతులు తెలుపడంతో శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మార్కెట్‌యార్డును సందర్శించి మాట్లాడారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్మడానికి తీసుకొస్తే మార్కెట్‌లో కూడా భద్రత లేదని, కాంగ్రెస్ వస్తే కరువొస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ హయాంలో గిట్టుబాటు ధరతో పొలాల వద్దే పంటను కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామన్నారు. ప్రభుత్వం స్పందించి పంట కొనుగోలుతోపాటు బోనస్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలన్నీ గాలికొదిలేయడంతో ప్రజలు అరిగోస పడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రైతును రాజును చేస్తే.. కాంగ్రెసోళ్లు మార్కెట్ యార్డుకు తాళాలు వేసి వారిని అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



పోతన్‌పల్లిలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ నేతలు

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మతచిచ్చు బీజేపీకి బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మరోసారి ఆశీర్వదించండి : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి





మదీనా మసీద్ వద్ద శ్రీనివాస్‌గౌడ్, మన్నెను సన్మానిస్తున్న మైనార్టీలు, వృద్ధురాలితో మాట్లాడుతున్న మాజీ మంత్రి

పాలమూరు, మే 7 : అమలుకాని హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మహబూబ్‌నగర్ రూరల్ మండలం జైనల్లిపూర్, ఫత్తేపూర్, మాచన్‌పల్లి, కోటకదిర, పోతన్‌పల్లి, జిల్లా కేంద్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసినట్లు గుర్తు చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేయించినట్లు తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలు, మాయ మాటలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను గారడీ చేశారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రైతుబంధు సాయం అందించకుండా.. రుణమాఫీ పేరుతో కాలయాపన చేస్తూ రైతులను చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. పంటలు నష్టపోయి రైతులు ఇక్కట్లు పడుతున్నా ఒక్క మంత్రి, ఎమ్మెల్యేలు పోయి పరామర్శించడం గానీ.. పరిహారం ఇవ్వడం గానీ జరగలేదన్నారు. రైతులపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికే ఎన్నో పథకాలను రేవంత్ సర్కారు నిలిపివేసిందన్నారు. సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు తండ్లాడుతున్నారని చెప్పారు. తెలంగాణ రాకముందు ఉన్న పరిస్థితి మళ్లీ కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులను బేరీజు వేయాలని సూచించారు. పదేండ్లలో తెలంగాణను అన్ని రంగాలలో దేశంలోనే ముందు వరుసలో నిలబెట్టామని గుర్తు చేశారు. ఇప్పటికీ హస్తం పార్టీ నేతల కల్లబొల్లి మాటలు నమ్మితే మరోసారి గోస తప్పదని హెచ్చరించారు. 70 ఏండ్ల నుంచి మహబూబ్‌నగర్‌ను ఎవరూ పట్టించుకోలేదని, పదేండ్ల కాలంలోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. గ్రామాలకు రోడ్లు.. నీళ్లు.. మహిళా సంఘాలకు భవనాలు, పార్కులు.. ఇలా ఎన్నో వసతులు కల్పించామన్నారు. కృష్ణానది నుంచి నీటిని మళ్లించి తాగునీరు అందించామన్నారు. కానీ నేడు తాగునీరు రోజు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరెంట్ నిమిషం కూడా పోకుండే.. నేడేమో ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. పేద ఆడబిడ్డల పెండ్లికి ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. వృద్ధులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్ ఇవ్వడం లేదని, గ్యారెంటీలు అటకెక్కాయని విమర్శించారు. నాడు ఎవరికైనా ఆరోగ్యం బాగా లేదంటే అర్ధరాత్రి, అపరాత్రి వెళ్లేటోళ్లమని, ప్రస్తుతం ఒక్కరూ కూడా వెళ్లడం లేదన్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. మతాల మధ్య చిచ్చు పెట్టే బీజేపీకి ఓటరులు చెక్ పెట్టాలని కోరారు. అనంతరం పోతన్‌పల్లి గ్రామంలో పలువురు నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రచారంలో గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్‌గౌడ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### మరింత అభివృద్ధి చేస్తా : మన్నె



గత ఎన్నికల్లో తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిపించారని, ఐదేండ్లల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరోసారి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని చెప్పారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలు, పట్టణాలకు వస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మితే మరోసారి మోసపోవడం ఖాయమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మంచి చేసే పార్టీలు, నేతను ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఓటేసే ముందు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూడాలన్నారు. ఆలోచన లేకుండా ఓటేస్తే గాయ్.. గాయ్.. గత్తర్ గాళ్లు గెలిచి మన బాగోగులు పట్టించుకోరన్నారు. అందుకే తనను మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

## ఆలోచించి ఓటేయాలి

- వనపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశాం
- ఆర్ఎస్పీని ఆదరించాలి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి/పెబ్బేరు, మే 7 : ఆచరణకు సాధ్యం కానీ హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. వనపర్తి మండలం మెంటపల్లిలో, పెబ్బేరు మండలం శాఖాపురం, తోమాలపల్లెలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టి ఐదు నెలలు పూర్తవుతున్నా.. ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని.. గత ప్రభుత్వానికి సంబంధించిన పథకాలే అమలవుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే హామీలు నెరవేర్చుతామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నాడని.. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. పేదల కుటుంబాలలో వెలుగులు నిండాలంటే ఆర్ఎస్పీ ఎంపీగా గెలవాలన్నారు. కాంగ్రెస్ కబంద హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి కలగాలంటే బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. ఇప్పటి వరకు స్థానికేతరులే ఎంపీగా కొనసాగారని, ఈసారి స్థానికుడు, అలంపూర్‌కు చెందిన ఆర్ఎస్పీని కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ విజయ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు రాములు, నాయకులు మాధవ్‌రెడ్డి, నర్సింహ, మహేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాము, రామకృష్ణ, తిరుమలయ్య, వెంకటేశ్, శ్రీను, వెంకటేశ్, మధు, వీరస్వామి తదితరులున్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి





మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలకపల్లిలో నిర్వహించిన రోడ్‌షోకు భారీగా హాజరైన బీఆర్ఎస్ నేతలు, ప్రజలు

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ
- ప్రజలను మభ్యపెడుతున్న సీఎం రేవంత్ : మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మే 7 : అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన సీఎం రేవంత్.. ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి తెలకపల్లి రోడ్ షోలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో ఎన్ని లబ్ధిచేకూర్చాయే ప్రజలే ఆలోచించుకొని ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చాణక్యనీతి సర్వేలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని 45 శాతం ఓట్లతో బీఆర్ఎస్ గెలిచే అవకాశం ఉన్నట్లు తేలిందన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తాను గురుకులాల కార్యదర్శిగా లక్షలాదిమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించానన్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు పోలీసు బందోబస్తు లేకుండా ప్రజల్లోకి రావడం లేదన్నారు. కేసీఆర్ పదేండ్ల నిజమైన పాలనకు, అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్ పాలనకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు తమ వంతుగా సాయం అందించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పథకాల అమలు పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ చెప్పే మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మొద్దన్నారు. ర్యాలీలో పార్టీ సీనియర్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మర్రి

## ఈదురుగాలుల బీభత్సం

- రాలిన మామిడి, నేలకొరిగిన పంటలు

నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మే 7 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సోమవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రాత్రి కూడా గాలులు మొదలై మెరుపులతో కూడిన వాన పడింది. దీంతో పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. వరి, ఇతర పంటలు నేలకొరిగాయి. కోడేరు మండలం బాడుగదిన్నె తండాలో పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధమైంది. బాడుగదిన్నె, నర్సాయపల్లి, ఎత్తం గ్రామ శివారుల్లోని మామిడి చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోయింది. రోడ్లకు అడ్డంగా చెట్లు పడ్డాయి. లింగాల మండల కేంద్రం శివారులో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. పాన్‌గల్ మండలం చింతలకుంటలో ఈదురుగాలులకు విద్యుత్‌తీగలు తెగి గేదె మృతి చెందింది. పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులో పిడుగుపాటుకు 48 గొర్రెలు మృతి చెందాయి.



మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



కోడేరు మండలం బాడుగదిన్నెలో ఈదురుగాలులకు విరిగిపడిన మామిడి చెట్లు